క్లుప్తంగా

కేంద్ర సాయుధ బలగాల కవాతు



పుచ్చకాయలమాడ గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధబలగాలు

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో శనివారం సీఐ మురళీమోహన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు 100 మంది సాయుధ బలగాలతో సమస్యాత్మక గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీసు యంత్రాంగం సహకారం ఉంటుందన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు భోజన సదుపాయం



భోజనం వడ్డిస్తున్న డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి శనివారం స్కానింగ్ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి వెంట వచ్చిన సహాయకులు 240 మందికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి భోజన సదుపాయాన్ని కల్పించారు. గైనకాలజిస్టు కల్పన చేతుల మీదుగా భోజనం వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అనిత, వార్డు సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

461 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



గర్భిణుల పేర్లు నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శనివారం గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేశారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి పెద్దసంఖ్యలో గర్భిణులు వచ్చారు. 461 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి తెలిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

14న జోడి రథోత్సవం



పూజలందుకున్న గాదిలింగేశ్వరస్వామి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో వెలసిన గాదిలింగేశ్వర స్వామి, సిద్దేశ్వరస్వామి జోడి రథోత్సవం ఈనెల 14వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. వచ్చే భక్తులకు అన్నదానం, తాగునీరు వసతి ఏర్పాటు చేశామన్నారు.

దేవర నిర్వహణకు విరాళం



నిర్వాహకులకు రూ.లక్ష నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: మండల కేంద్రంలో ఈనెల 13వ తేదీ జరగనున్న గ్రామ దేవరకు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ముందుగా గ్రామదేవతలైన అంకాలమ్మ, బంగారమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ నిర్వాహకుడు యల్లారెడ్డికి నగదును అందజేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్ఓ విద్యావతి తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ మాత్రమే)లో 40 సీట్లు ఉన్నాయన్నారు. అనాథలు, బడి బయట, బడిమానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల్లోని పేద బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కేజీబీవీ పాఠశాలను సంప్రదించాలన్నారు.

నేత్రపర్వం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం

- వేడుకగా మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ఆస్పరి: మహాశివరాత్రి సందర్భంగా బిణిగేరి సమీపంలోని శ్రీగిరి పంచలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకుడు శ్రీనివాసులు నాయన ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. పంచలింగేశ్వరస్వామికి గంగపూజ, కుంభోత్సవం, నందికోలు సేవ, గంధం సేవ చేశారు. మేళతాళాలతో ఊరేగించారు. గొరవయ్యల పాలసేవ, వీరభద్ర స్వామి అవతారి నాగలింగయ్యస్వామి చెప్పిన ఖడ్గాలు, నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఓం నమః శివాయ నామస్మరణంతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కల్యాణం.. కమణీయం

తుగ్గలి: చెన్నంపల్లిలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను తేరులో ఉంచి ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ నేత, పత్తికొండ మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా ఉమామహేశ్వరుని తిరునాల

కృష్ణగిరి: లక్కసాగరం గ్రామంలో ఉమామహేశ్వర స్వామి తిరునాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్తలు పి.లక్ష్మిరెడ్డి, రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రభపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు.

మహాశివరాత్రి వేడుకలు

దేవనకొండ: పి.కోటకొండ గ్రామంలోని శ్రీరాంబావి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. రాత్రి జాగరణ సందర్భంగా చిన్న పిల్లలతో శివుని నాటకాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. పార్వతీపరమేశ్వర ప్రతిమలను గ్రామవీధుల మీదుగా ఊరేగించారు. శివగురుస్వామి, శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, రంగడు, లక్ష్మన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

విశేష పూజలు

మద్దికెర: మండలంలోని పెరవలి, హంప తదితర గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణ చేసి పంచామృతాభిషేకం, మహామంగళహారతి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక కొండమ్మ బావిలో ఉన్న జోడు లింగాలకు పూజలు నిర్వహించారు.



కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు



ఆస్పరి: బిణిగేరిలో శివపార్వతుల కల్యాణం



కృష్ణగిరి: లక్కసాగరంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



దేవనకొండ: స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



గొరవయ్యల నృత్యం



దేవనకొండలో శివపార్వతుల కల్యాణం



కృష్ణగిరి: ప్రభోత్సవం



తుగ్గలి: చెన్నంపల్లిలో శివపార్వతుల కల్యాణం

వైభవం.. స్వామివారి రథోత్సవం



రథయాత్రలో పాల్గొన్న సమన్వయకర్త బుట్టా రేణుక



రథం ముందు యాగ పూజలు



మద్దికెర: కొండప్పతాత రథోత్సవం



అశేష జనవాహిని మధ్య సాగుతున్న రామలింగేశ్వరుడి రథోత్సవం



మద్దికెర: కొండప్పస్వామి

నందవరం: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా గురుజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం మహారథోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ దినేష్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేడుకలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక చేతుల మీదుగా యాగమండపంలో పూర్ణాహుతి గావించి రథోత్సవానికి అంకురార్పణ పలికారు. నంది మండపం వరకు యాత్ర సాగింది. నందీశ్వరుడికి నారికేళాలు సమర్పణ యథాస్థితికి రథాన్ని చేర్చారు. రథయాత్ర సందర్భంగా నంది కోళ్ల ప్రదర్శలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బుట్టా రేణుక దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐలు తిమ్మయ్య, రమేష్ బాబు, శరత్‌కుమార్‌రెడ్డి, ముగ్గురు ఏఎస్ఐలు, 25 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అద్వితీయం ఆదిదంపతుల కల్యాణం

వేకువజామున పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం తుంగా నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కాశి, రామ, ధర్మ, భీమ, పార్థ లింగాలను దర్శించుకున్నారు. ఈఓ దినేష్, పురోహితులు హంపేష్‌స్వామి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పెద్ద నరసింహులు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, గురజాల సర్పంచ్ వీరస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండప్పస్వామి రథోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారంలో అవధూత శ్రీకొండప్ప తాత రథోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, మహామంగళహారతి..అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం గ్రామం నుంచి మేళతాళాలతో కుంభాలతో ఊరేగింపుగా వచ్చి స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉత్సవమూర్తికి పూజలు చేసి రథంలో కొలువుంచారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు.

బుగ్గ సంగమేశ్వర రథోత్సవం

మద్దికెర: బుగ్గ సంగమేశ్వరంలో అశేష జన వాహిని మధ్య రథోత్సవం జరిగింది. ఉదయం దేవాలయంలో స్వామి వారికి అభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

రుద్రమునిస్వామికి ప్రత్యేక పూజలు

హాలహర్వి: బిలేహాల్ గ్రామంలోని రుద్రముని స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా మహాశివరాత్రి రోజున ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



పూజలందుకున్న రుద్రమునిస్వామి

సిద్ధలింగేశ్వరస్వామి ఉచ్చాయోత్సవం

హొళగుంద: ముద్దటమాగి గ్రామంలో సిద్ధలింగేశ్వరస్వామి ఉచ్చాయోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉచ్చాయలో ప్రతిష్ఠించిన స్వామి చిత్రపటానికి ఆలయ పూజారులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్థానిక తేరు బజారులో ఉచ్చాయాన్ని బసవన్న కట్ట వరకు లాగారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారి విరాట్‌మూర్తికి జలాభిషేకం, ఆకుపూజ, రుద్రాభిషేకం, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలు చేశారు. సాయంత్రం అశేష భక్తుల నడుమ ఉచ్చాయాన్ని లాగారు. తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.



ఉచ్చాయోత్సవం

వైభవంగా పక్కీరప్ప తాత రథోత్సవం

ఆస్పరి: ఆస్పరిలో పక్కీరప్ప తాత రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. రథాన్ని నంది విగ్రహం వరకు లాగి, తిరిగి ఆలయానికి చేర్చారు. నిర్వాహకుడు పెద్ద తిమ్మన్న ఆధ్వర్యంలో ఉదయం తాత ఉత్సవ విగ్రహాలు, కుంభాలను భక్తులు మేళతాళాలతో ఊరేగించారు. గురవయ్యల నృత్యం ఆకట్టుకుంది. మండలంలోని శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, అటికెలగుండు, హలిగేరి, జొహరాపురం, చిన్నహోతూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులుతరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

యాటకల్లులో వేడుకగా కల్యాణం

మండలంలోని యాటకల్లులో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్చకుడు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

తాగునీటి బోరు ఏర్పాటు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక బోర్లను వేయించారు. గ్రామానికి అలువాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి నీరు సరఫరా అవుతోంది. అయితే వేసవి కాలంలో నీటి సమస్య తీవ్రం అవుతుందని ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె శనివారం గ్రామంలో రెండు బోర్లు వేయించారు. ఒక బోరులో నీళ్లు సమృద్ధిగా రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. బుట్టా రేణుకకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుదాస్, రామకృష్ణ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



పెద్దమరివీడులో వేస్తున్న బోరు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ కురువ మాదేవమ్మ, వైఎస్సార్‌సీపీ నేత భీమిరెడ్డి ప్రారంభించారు. నంద్యాల జిల్లా డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైమున్నా వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో కృష్ణగిరి, ఆలంకొండ గ్రామాలకు చెందిన మునిరంగడు యాదవ్, సోమోజీనాయుడు వృషభాలు సంయుక్తంగా నిలిచాయి. మూడో స్థానంలో నన్నూరు చిన్న మద్దయ్య, నాలుగో స్థానంలో సురేష్ వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేలను అందజేశారు.

కబడ్డీ విజేత గోనెగండ్ల

అలాగే కబడ్డీ పోటీల్లో గోనెగండ్ల జట్టు విజేతగా నిలిచింది. తుగ్గలి మండలం నున సురాళ్ల, కోడుమూరు మండలం వల్కూరు జట్లు ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ. 10వేలు, రూ.5వేలను అందజేశారు.

బోడబండ తిరునాల

తుగ్గలి: బోడబండ పుణ్యక్షేత్రం జనంతో కిక్కిరిసిపోయింది. అశేష జన సందోహం మధ్య మీటేతండ సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో తిమ్మగురుడు, పక్కీరప్పస్వాముల తిరునాలను వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం ఉత్సవమూర్తులను వేర్వేరు రథాల్లో ఉంచి ఆనందోత్సాహాల మధ్య భక్తులు రథాలను లాగారు. పక్కీరప్పస్వామి ఆలయంలో మదనంతపురం శ్రీరాములు, ఈశ్వరమ్మ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తలు కనికిరెడ్డి సుదర్శనరెడ్డి, అప్పా వేణు, ఆలయ నిర్వాహకులు కనికిరెడ్డి, అప్పా, పూజారులు కృష్ణయ్యాచారి, భీమన్న పాల్గొన్నారు.



తిమ్మగురుడు స్వామి

జగనన్న పాలనలోనే ఠంచనుగా పింఛన్లు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు సమన్వయకర్త బుట్టా రేణుక



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వృద్ధులకు ఠంచనుగా పింఛన్ అందుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. శనివారం పట్టణంలోని 2వ వార్డులో ఆమె పర్యటించారు. ముందుగా టోపయ్య గుడిలో పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు కౌన్సిలర్ అంపమ్మ, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ పింఛన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. చేనేత కార్మికులతో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో పింఛన్, సంక్షేమ పథకాలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి ఉండేదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటి తలుపు తట్టి అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు బుట్టా నీలకంఠ, బుట్టా ప్రత్యుల్, కౌన్సిలర్లు ఖాసీంబేగ్, కామర్తి నాగేషప్ప, పూజేశ్వరి ,ఇషాక్ అమాన్, ఇషాక్, రాజారత్నం , సుధాకర్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో బైక్ ర్యాలీ

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడానికి యువత కీలక పాత్ర పోషించాలని బుట్టారేణుక అన్నారు. శనివారం సాయంత్రం 15వ వార్డు కౌన్సిలర్ ఇషాక్, బుట్టా ప్రత్యుల్ యూత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆమెకు క్రేన్‌తో గజమాల వేసి సత్కరించారు. పార్టీ విజయానికి యువత కృషి చేయాలని ఆమె కోరారు.

పాస్టర్లకు చేయూతనిచ్చిన జగన్

పాస్టర్లకు చేయూతనిచ్చి.. వారి అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని బుట్టారేణుక అన్నారు. పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో నియోజకర్గంలోని పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. పాస్టర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. చర్చిలకు ప్రభుత్వ సహకారం అందేలా చూస్తామన్నారు. సునీల్‌కుమార్, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, పాస్టర్లు రెవరెండ్ జయన్న, చినబాబు, ప్రసాద్, యోహాన్, సామెల్ పాల్గొన్నారు.



2వ వార్డులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న బుట్టా రేణుక



బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులు

నేడే గురుకుల ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుజాత తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటర్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

ఆలూరు: ఆలూరులోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో సోమవారం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి హాజరుకానున్నారు.

కబడ్డీ విజేత అలుసందుగుత్తి

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో శ్రీగిరి పంచలింగేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఆదోని మండలం అలుసందుగుత్తి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.15,016 వేలు, రెండో బహుమతి బిణిగేరి జట్టుకు రూ.7,016 వేలను వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి తనయుడు బుసినె చంద్రశేఖర్ అందజేశారు. అంతకు ముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నరెడ్డి, సోమన్న పాల్గొన్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్